# ★ 'పిరికిగుండెలు' ★

రచన: 'శ్రీ ప్రసీల్'

బొంబైలో రోడ్డుమీద నడుస్తూవుంటే, ఒక ఇంటి గుమ్మంలో కనిపించింది తుషారణ. ఆదర్శరావు ఆగాడు. మనిషిని పోలిన మనిషేమోననుకున్నాడు; అడగటానికి ధైర్యం చాల లేదు. కట్టు, పద్ధతి, అంతా పూర్తిగా మారిపోయి వుంది.

"ఎవరు? ఆదర్శరావా?" అన్నది తుషారణ.

సందేహనివారణతోబాటు ఆనందం గుమ్మెసింది ఆదర్శరావుని—

ముప్పైయేళ్ళ కిందటి సంగతి.

అప్పుడు తుషారణ, ఆదర్శరావులు యవ్వనంచే దీవింపబడ్డారు.

ఇద్దరికీ ఒకటే ఈడు. ఆదర్శరావు తుషారణను కన్నుమిన్నూ తెలీకుండా ప్రేమించాడు. ఈ ముప్పైయేళ్ళబట్టీ తుషారణను చూడకుండానే, తుషారణను ప్రేమిస్తున్నాడంటే, అతడి ప్రేమలోని పటుత్వం చాలా గొప్పదన్నమాటే.

మరొకసంగతేమిటంటే, ఆదర్శరావు తుషారణను యెంత తలక్రిందులుగా ప్రేమించాడో తుషారణకూడా ఆదర్శరావుని అదేవిధంగా ప్రేమించింది.

కానీ జరిగిందేమిటంటే, ఆదర్శరావు తను ప్రేమించని మరొకఅమ్మాయిని పెళ్లిచేసుకొని, ఇప్పుడు పెద్దకొడుకుని ఇంగ్లండు పంపాడు.

తుషారణకూడా తను ప్రేమించని వ్యక్తిని పెళ్లిచేసుకుంది—కొడుకులు, కూతుళ్లు, కోడళ్లు, అల్లుళ్లు. ఈ విధంగా విచ్ఛిన్నమైపోయింది తుషారణాదర్శరావుల ప్రేమ.

ఇట్లా అవటానికి కారణమేమిటి? సంఘనిబంధనలా? అవ్వే, ఆదర్శరావుకి అటువంటి వేపీ మెదుర రాలేదు. తలిదండ్రుల కాఠిన్యతా? అంతకన్నా ఏమీ చెయ్యలేదు ఆదర్శరావుని.

మరిహ కారణం యేమిటి?

••• ••• •••

"తుషారణా, యెన్నాళ్ళయింది నిన్ను చూచి? అబ్బా—ముప్పైయేళ్లు—ఈ మధ్యలో పెళ్లయింది. పెళ్లాం చనిపోయింది."

"నాకూ పెళ్లయింది. ఆయన పోయారు" అంటూ ఇద్దరూ తమతమ కుటుంబవిషయాలు చెప్పుకున్నారు.

"ముప్పైయేళ్లకిందటి సంగతులు గుర్తున్నయ్యా తుషారణా?"

"లేకేం?" అన్నది తుషారణ.

"అబ్బా! నిన్ను యెంత ప్రేమించాను? అప్పుడు చెప్దామనుకుంటే ధైర్యం చాలకపోయింది. నువ్వు నన్ను ప్రేమిస్తున్నావో లేదో. నేను నిన్ను ప్రేమిస్తున్నానని చెప్తే, మన స్నేహానికి భంగం కలుగుతుందేమో, నిన్ను చూస్తూవుండటానికి, మాట్లాడుతూవుండటానికి అవకాశం వుండదేమో నని భయపడి...."

"నువు నన్ను ప్రేమిస్తున్నావని నాకప్పుడే తెలిసినట్లయితే ........ అబ్బా....మన జీవితాలు మరొకరకంగా నడిచివుండేవి కాబోలు. నాకూ ధైర్యం చాలకపోయింది చెప్పటానికి—" అంటూ నిట్టూర్చింది తుషారణ.

"ఈ అధైర్యమే మన జీవితాలను నాశనం చేసింది" అన్నాడు ఆదర్శరావు—

